# ప్రదర్శన

ఆయన నవ్వుతున్నాడు.

స్థిరచిత్తాన్ని సూచిస్తున్న అద్భుతమైన కళ్ళు.

ఆపైన కళ్ళజోడు.

కార్యదీక్షలో నిమగ్నమైనట్టు కొద్దిగా ముందుకు వంచిన గుండ్రని ముఖం.

బోసినోరు.

దరిద్రనారాయణతకు చిహ్నంగా లోతుకు పోయిన కడుపు.

స్థిరమైన పట్టులో నిటారుగా నిలబడ్డ పొడవాటి చేతికర్ర.

విల్లులా ముందుకు వంగిన నడుము.

–బడుగు భారతజాతికి ప్రతిరూపం–

తాను మరణించిన ముప్ఫై ఏడేళ్ళ తరువాత ప్రదర్శనకు నడివీధిలో నిలబడ్డ మహాత్ముడు!

మురికివాడల్లో సంచరించిన శరీరాన్ని అందమైన పబ్లిక్ పార్క్‌లో వుంచారు.

శతకోటి భారతీయుల మెత్తని హృదయాలలో నడయాడే పాదాలు కఠిన శిలావేదిక మీద నిలుచున్నాయి.

చుట్టుపక్కల వాతావరణం పసందుగా వుంది. పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. అక్కడక్కడ ఆడామగా జంటలుగా కూర్చున్నారు. కళాహృదయం గల ఒకరిద్దరు కెమెరాబాబులు మహాత్ముడికి చేరువలో తమ ప్రియురాలినో, కన్నబిడ్డనో నిలుచోబెట్టి ఫొటోలు గుంజుతున్నారు.

ఆకాశంలో మెల్లగా మేఘాలు కమ్ముకుంటున్నాయి. అయితే అవి ఎక్కువసేపు నిలవడం లేదు. సాయంకాలపు చల్లగాలికి అలా అలా తేలియాడుతూ సాగిపోతున్నాయి. ఇవేవీ పట్టనట్టు ఆయన తన ధోరణిలో తాను నవ్వుతూనే వున్నాడు.

ఆ నవ్వులోకి దీక్షగా చూస్తూ నిలబడ్డ పోలిగాడు కూడా నవ్వుతున్నాడు.

హృదయపూర్వకంగా మాత్రం కాదు–

వెక్కిరింపుగా!

పోలిగాడు మూగవాడు – పలకలేదు.

అయితే గుడ్డివాడు మాత్రం కాదు – కళ్ళలో భావాలు పలికించగలడు.

ఆ కళ్ళలోకి విమర్శనాత్మకంగా చూస్తే లోతుగా ఎక్కడో హృదయాంతరాళాల్లో గూడుకట్టుకున్న విషాదం గోచరిస్తుంది.

పోలిగాడు రోజూ అక్కడికొస్తాడు!

కాస్సేపు నిలబడతాడు!

ఆ మహానుభావుడికేసి చూస్తాడు!

పెదవులతో నవ్వుతాడు!

కళ్ళతో ఏడుస్తాడు!

వెళ్ళిపోతాడు!

కారణం...?

ఆ జాతిపితకు తెలుస్తుందో లేదో!?

ఆ ఊరి మునిసిపల్ ఛైర్మన్‌కు మాత్రం తెలుస్తుంది.

ఇంకా కొందరు పెద్ద మనుషులకు తెలుస్తుంది.

పోలిగాడి ఇల్లు సరిగ్గా మహాత్ముడి కాళ్ళకింద భూస్థాపితమై వుంది!

ఇప్పుడాయన నిలబడ్డ చోటనే ఒకప్పుడు పోలిగాడి పూరి గుడిసె అరిపేదగా నిలబడి వుండేది. పోలిగాడి గుడిసెతో పాటు ఇంకా చాలామంది హరిజనుల ఇళ్ళు ఆ చుట్టుపక్కల వుండేవి. ఇప్పుడు వాటి స్థానంలో అందమైన పూలమొక్కలు ఆనందంగా తలలూపుతూ వున్నాయి.

ఆనాటి మురికివాడ ఇప్పుడు నందనోద్యానమైంది.

అందుకే మహాత్ముడు నవ్వుతున్నాడేమో!

❖ ❖ ❖

గాంధీ జయంతినాటికి గాంధీగారి జ్ఞాపకార్థం ఏదైనా ఘనకార్యం తల పెట్టాలని ఆ వూరి మునిసిఫల్ ఛైర్మన్‌గారికి తట్టింది.

నిజానికా ఊళ్ళో 'గాంధీరోడ్డు' ఒకటుంది. అది మహాత్ముని కీర్తికి వన్నె తెచ్చేదిగా లేదని ఆయన అనుమానం.

ఊళ్ళో గాంధీగారి విగ్రహం ఒకటి ప్రతిష్ఠించాలని చాలాకాలంగా అనుకుంటున్నదే.

అదేదో తన హయాంలో పూర్తి చేస్తే!

రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా?

వెంటనే తన ఆలోచన కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నాలు మొదలెట్టాడాయన.

ఆ ఊరి నడిబొడ్డున హరిజనవాడ ఒకటుంది.

ఇదెక్కడి విడ్డూరం!

హరిజనవాడలెక్కడైనా ఊరవతలుంటాయిగాని!

నాగరిక ప్రపంచం నడుమ వాళ్ళుంటే మైల కూడాను. ఈ విషయం అగ్రవర్ణాలకు చెందిన ఊరి పెద్దమనుషులు తన దృష్టికి తెచ్చారు కూడా.

ఈ హరిజనులనక్కణ్ణించి తోలేస్తే...

ఓ అందమైన పార్కు అక్కడొస్తే...

అమ్మో! ఎంత మంచి ఆలోచన!

ఊరికి నడుమ పార్కుకు పార్కూ వుంటుంది. గాంధీగారికి గాంధీగారూ వుంటారు.

గాంధీగారు మాత్రం సామాన్యంగా వుండకూడదు.

సినిమా షూటింగ్‌లక్కూడా పనికొచ్చేలా దర్జాగా వుండాలి.

తన హయాంలో ఇంత గొప్ప పనిచేసినందుకు ప్రజలు తనని గుర్తు పెట్టుకుంటారు. అందమైన పార్కు ఏర్పాటు చేసినందుకు వచ్చే ఎన్నికల్లో తనకు ఓట్లు కూడా వేస్తారు.

మరి హరిజనులో!

ఆ, వాళ్ళ ఓట్లు లేకపోతే ఎంత! అంతా కలిసి అయిదు వందలుంటాయేమో ఓట్లు వాళ్ళవి! వాళ్ళని తోలేస్తే మిగతా అగ్రవర్ణాల వారు ఎలాగూ వేస్తారు ఓట్లు. ఆ లోటు అలా పూడ్చుకోవచ్చు.

ఆ హరిజనుల్ని ఇంకా అక్కడే వుండనిస్తే ఆ చుట్టుపక్కలున్న విలువైన స్థలాల్ని కాస్తా కాజేస్తారు. అంతా రొష్ఠు పట్టిపోతుంది.

ఇలా ఆలోచించి ఛైర్మన్‌గారు మున్సిపల్ కౌన్సిల్లో రెసల్యూషన్ ఒకటి పాస్ చేయించారు. దాని ప్రకారం ఊరికి మధ్యలో మునిసిపల్ పార్కు ఒకటి వస్తుంది. అందులో గాంధీగార్ని నిలబెట్టేస్తారు.

ఆ ఊరి కౌన్సిలర్లు చాలామంది తలకాయ లేని వాజమ్మలు. వాళ్ళలో మెజారిటీ వర్గానికి మన ఛైర్మన్ గారు నాయకుడు. మిగిలిన కొద్దిమంది కౌన్సిలర్లలో చాలామందికి ఆ పార్కు వచ్చేట్టయితే ముందుగా అక్కడ్నుంచి హరిజనుల్ని ఖాళీ చేయించాల్సి వస్తుందన్న విషయం తట్టనే లేదు. ఒకరిద్దరికి తట్టిందిగాని ఛైర్మన్‌గారి 'ప్రతాపానికి' జడిసి మెదలకుండా ఊరుకున్నారు.

ఇక ఆ హరిజనవాడ వున్న వార్డు తాలూకు కౌన్సిలర్ మన ఛైర్మన్‌గారే! ఆయనకా ప్రాంతంలో స్థలాలు కూడా వున్నాయి. ఈ అలగా జనాన్ని ఖాళీ చేయిస్తే ఆ స్థలానికి విపరీతమైన గిరాకీ వచ్చి పడుతుంది. దగ్గర్లోనే పార్కు వెలుస్తున్నదాయే. ఆ ప్రదేశం కాస్తా మెయిన్ సెంటరయి కూర్చుంటుంది. అదీ అసలు సంగతి!

దరిమిలా కౌన్సిల్లో హరిజనుల తరఫున ప్రశ్నించే నాథుడే లేకపోయాడు.

హరిజనులు గొడవ చేశారు.

వాళ్ళు ప్రతిపక్షనాయకులతో చెప్పి చూశారు. వాళ్ళు తప్పకుండా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు – హామీ మాత్రమే ఇచ్చారు. అంతకుమించి ఏమీ చేయలేదు. హరిజనులు ఊరి మధ్యన ఉండడం పట్ల సర్వత్రా వ్యతిరేకత ప్రబలి వుంది. ఈ విషయంలో వేలు పెడితే మెజారిటీకి చెందిన అగ్రవర్ణాలవారి ఓట్లు తమకు రాకపోవచ్చు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర్లోనే వున్నాయి మరి! అందుకే వాళ్ళు కొన్ని తాటాకు చప్పుళ్ళు చేసి ఊరుకున్నారు.

హరిజనులు కలెక్టరుకూ, ముఖ్యమంత్రికీ, మైనారిటీల కమిషన్‌కూ మహజర్లు పంపుకున్నారు. లాభం లేకపోయింది. ముఖ్యమంత్రిని కలుసుకొనేందుకు పోతే ఆయన ఎన్నికల ప్రచారంలో మునిగిపోయి ఈ దీన జనావళిని పట్టించుకోనేలేదు. అందుబాటులో వుండిన హోమ్మినిస్టరుగారు మాత్రం అరచెయ్యి చూపించి అభయం పలికి, "రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయండి, మీ స్థలాలు ఖాళీ చెయ్యనివ్వం. అందాకా మీరు ఎవరొచ్చినా ఖాళీ చెయ్యొద్దు," అన్నారు.

ఆయనగారి మాట నమ్ముకొని హరిజనులు స్థలాలు ఖాళీ చెయ్యం పొమ్మన్నారు.

ఛైర్మన్‌కు ఈ 'జనం' ఇలా తిరగబడతారని ముందే తెలుసు.

అయితే మాత్రం భయం దేనికి? హరిజనులకు అభయమిచ్చిన హోమ్మినిష్టరుగారే తమ ఇలాకా అయిపోయె.

ఆయన వెంటనే హోమ్మినిస్టర్‌తోనే సంప్రదించి హరిజనుల్ని ఖాళీ చేయించే మాస్టర్ ప్లాన్ ఒకటి తయారు చేశారు.

అందులో హోమ్మినిస్టరుగారి పాత్ర చాలా చిన్నదే. సమయానికి తగిన చర్య తీసుకోకుండా పోలీసుల్ని ఓ ఇరవై నాలుగ్గంటలపాటు మెదలకుండా కళ్ళు మూసుకోమని పురమాయించడమే!

ఇక మొదలైంది దౌర్జన్యకాండ.

అర్ధరాత్రి పూట కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హరిజనవాడలోకి జొరబడ్డారు.

హరిజన నాయకుణ్ణి బయటికి ఈడ్చుకొచ్చి, "మర్యాదగా ఖాళీ చేయమంటే చెయ్యర్రా

మీరు! మీ బాబుగాడి స్థలాల్రా? మాలజాతికింత పొగరా!!" అని కారుకూతలు కూస్తూ అతన్ని తన్ని, అతని గుడిసె తగలబెట్టేశారు.

ఒకదాని వెంట ఒకటి అరవై గుడిసెలదాకా తగలబడిపోయాయి.

ఇంకొందరు దుండగులు కళ్ళకు నదురుగా కనిపించిన హరిజన స్త్రీలను జుట్టుపట్టి లాక్కొచ్చి సామూహిక మానభంగం చేశారు. అడ్డుపడబోయిన మగాళ్ళను చితకబాదారు.

ఇద్దరు పసిపిల్లలు మంటల్లోపడి నిలువునా కాలిపోయారు.

తెల్లారేసరికి హరిజనవాడ పూర్తిగా దగ్ధమై నగ్నంగా నిలబడింది.

ఊరంతా ఆవులిస్తూ లేచి కూర్చుని ఈ దారుణ కాండని మౌనంగా గమనించింది.

పోలీసులు వచ్చారు. రిపోర్టు రాసుకున్నారు.

హడావుడిగా ఓ పదిమంది అనామకుల్ని అరెస్టు చేసి ఛార్జిషీట్ ఫైలు చేశారు.

ఆ మరుసటి రోజు ఛైర్మన్ గారింట్లో మందు పార్టీ జరిగింది.

విషయం పత్రికల కెక్కింది.

దేశం అట్టుడికిపోయింది.

ప్రతిపక్ష నాయకులు ఈ సంఘటనని ఎన్నికల్లో అధికార పార్టీమీద అస్త్రంగా ఉపయోగించదల్చుకున్నారు. వాళ్ళు ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

ముఖ్యమంత్రి హరిజనులకు పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు పది అరెస్టులు ఆనాడే చేశారని పత్రికలకు స్టేట్‌మెంట్లు విడుదల చేశారు.

నిరాహారదీక్షలు జరిగాయి.

అన్నిరకాల హంగామా అయ్యింది.

ప్రజలు తమకు సహజంగా వుండే శాడిస్టిక్ ఎగోని సంతృప్తి పరిచేందుకు మాత్రమే ఈ వార్తలు చదువుతూ వచ్చారు. పాపం హరిజనులని సానుభూతి వెలిబుచ్చారు.

హరిజనులకు ఒరిగిందేమీ లేదు. వాళ్ళు భీతితో చెల్లాచెదురైపోయారు.

రోజులు గడిచాయి.

క్రమంగా ప్రజలు ఈ దౌర్జన్య సంఘటన మర్చిపోయారు. హరిజనులు సోదిలోకి కూడా రాలేదు. పత్రికలు కూడా అందుగురించి రాయడం మానుకున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

ఇదివరకటి ముఖ్యమంత్రే గెలిచాడు.

హోమ్మినిస్టరూ గెలిచాడు.

మునిసిపల్ ఎన్నికలు పెడితే ఆ ఊరి ఛైర్మన్ మళ్ళీ గెలిచి కూర్చునేందుకు అవకాశాలు గట్టిపడ్డాయి.

ఇంకొన్ని రోజులు గడిచాయి.

హరిజనవాడ శుభ్రం చేసి అక్కడ చెత్తాచెదారాన్ని బండ్లకెత్తించి పారబోయించారు.

పార్కు వెలిసింది.

పార్కులో గాంధీగారూ వెలిశారు.

ఛైర్మన్ గారి కోరిక ఈడేరింది.

పార్కుకు 'గాంధీ పార్కు' అని నామకరణం చేశారు.

హోమ్మినిస్టరుగారు పరివారంతో దిగబడి రిబ్బన్ కత్తిరించి పార్కు ప్రారంభోత్సవం చేసి గాంధీగారిని పుష్పమాలాలంకృతుల్ని చేశారు.

బాపూజీ కలలు కన్న భారతదేశం గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు సాగాయి.

చుట్టుపక్కల పల్లెటూళ్ళ నుంచి లారీలతో జనాన్ని అద్దెకు తోలి సభను జయప్రదం చేశారు.

❖ ❖ ❖

"సారే జహాఁసే అచ్ఛా
హిందూస్థాన్ హమారా..."

పార్కు రేడియోలో శ్రావ్యంగా ఎవరో పాడుతున్నారు.

పోలిగాడు మహాత్ముడికేసి చూస్తూనే వున్నాడు.

మహాత్ముడు నవ్వుతూనే వున్నాడు.

"గాంధీగారి బొమ్మ ఎంత అద్భుతంగా వుంది!" ఎవరో వ్యాఖ్యానించారు.

"నిజంగా ఆయనక్కడ నిలబడ్డట్టే వుంది," మరొకరెవరో అన్నారు.

ఇంకొక రెవరో కెమెరా క్లిక్ మనిపించారు.

వాతావరణం బాగా చల్లబడిపోయింది.

క్రమంగా వెలుతురు తగ్గిపోతోంది.

మబ్బులు మరింతగా ముసురుకుంటున్నాయి.

శిల్పంలా నిలబడి మహాత్ముడి కేసి చూస్తున్న పోలిగాడిలో మెల్లగా చైతన్యం వచ్చింది.

అక్కణ్ణించి కదిలి వెనక్కి తిరిగి భారంగా నడుస్తూ ముందుకు సాగిపోయాడు.

ఎక్కడో దూరంగా ఆకాశంలో ఓ మెరుపు మెరిసింది.

ఎక్కడో వురిమింది.

'దేవతలు యుద్ధం చేస్తున్నారు,' అనుకున్నారు పిల్లలు.

నల్లని మబ్బులు నీలాకాశాన్ని ఆక్రమించుకొంటున్నాయి.

గాలి ప్రారంభమైంది. మేఘాల్ని తరిమెయ్యడానికది భీమ ప్రయత్నం చేయసాగింది.

ఎక్కడినుంచో సన్నని మబ్బు తునక ఒకటి అటుగుండా ప్రయాణం చేస్తూ వచ్చింది.

చల్లగాలి సోకి అది కొద్దిగా ద్రవించింది.

ఆకాశం నుంచి రెండే రెండు చినుకులు సూటిగా దిగి వచ్చి మహాత్ముడి శిరస్సు నభిషేకించాయి.

బహుశా అక్కడెక్కణ్ణుంచో మహాత్ముడే తన స్థితికి రోదిస్తున్నాడేమో!

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 11-4-1986*